

అప్పల బాధతో సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి- కంటోన్మెంట్

బెట్టింగులు ఆ యువకుడి ప్రాణాలు బలిగొన్నాయి. ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందన్న ఆనందం ఎంతో కాలంలో నిలువ లేదు. బెట్టింగులు అప్పుల బాధలు భరించలేక విజయనగరంలోని గౌడు వీధిలో సచివాలయ ఉద్యోగి మంగళవారం ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. గౌడు వీధికి చెందిన ముంగర అవినాష్ (32) మెరకముడిదాం మండలం ఊటపల్లిలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. బెట్టింగులు, లోన్ యాప్‌లతో అప్పులపాలయ్యాడు. ఈనేపథ్యంలో తన బెడ్ రూమ్ లో ఫ్యాన్ కు ఉరుపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు చూసి తన భార్య భాగ్యలక్ష్మి కి సమాచారం అందించారు. టూ టౌన్ ఎస్ఐ ఎం.కృష్ణమూర్తి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుని భార్య భాగ్యలక్ష్మి ఓ ప్రైవేట్ స్కూల్లో ఉపాధ్యాయినిగా పనిచేస్తుంది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కృష్ణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవయవదానంతో పునర్జన్మ

- అవగాహన పెరిగితేనే మరణాలు తగ్గుముఖం
- నేడు అవయవదాన దినోత్సవం



అవయవ దానం చేసిన లంకేన సాయి (ఫైల్)

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

మనిషి మరణిస్తే తిరిగి రారని బాధపడతాం. కానీ, మరణిస్తున్న మనిషి 8 మందికి పునర్జీవం పోయవచ్చని వైద్యులు, జీవన్ దాన్ ట్రస్ట్ నిరూపిస్తోంది. ఔను...! నిజమే అవయవ దానం విషయంలో మూఢనమ్మకాలు, అపోహలు వీడితే ఎందరికో పునర్జన్మ ప్రసాదించవచ్చు. గత ఏడాది మన జిల్లాలోని తిరుమల - మెడికవర్ ఆసుపత్రి చేసిన ఇటువంటి ప్రయత్నం విజయవంతమైంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 13న జరుపుకోబోతున్న ప్రపంచ అవయవ దాన దినోత్సం సందర్భంగా ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

ఒకప్పుడు రక్తదానం చేయడమే గొప్ప. కానీ, నేడు అవయవదానం ఓ మంచి సంప్రదాయంగా మారాల్సిన అవసరం ఉంది. ఇందుకు కారణం లేకపోలేదు. సగటు మనిషి జీవన పోరాటంలో నిత్యం బిజీబిజీగా మారుతున్నారు. కాలంతో పోటీ పడుతున్నారు. ఈనేపథ్యంలో రోడ్డు ప్రమాదాలు నిత్య కృత్యంగా మారాయి. ఇటువంటి సందర్భాల్లో స్వల్పగాయాలతో బయటపడినవారు కొందరైతే, అవిటివారుగా మారినవారు మరికొందరు. మనిషి శరీరభాగాల్లో అత్యంత కీలకమైన, సున్నితమైన కిడ్నీ, గుండె, ఊపిరితిత్తులు, బ్రెయిన్ వంటివి దెబ్బతినడంతో ప్రాణాపాయ స్థితిలోకి వెళ్తున్నవారు ఇంకొందరు. ఇటువంటి సందర్భాల్లో అవయవ మార్పిడి చేస్తే బతికేందుకు అవకాశం ఉన్నా, సమయానికి ఆయా అవయవాలు అందుబాటులో లేక యువ కిశోరాల జీవితం సైతం అర్థాంతరంగానే ముగిసిపోతోంది. చేతికి అందిన కొడుకు లేదా కూతురు మృత్యువాత పడడంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్ళన్న సందర్భాలు కోకొల్లలుగా ఉన్నాయి. పిల్లలు పసిప్రాయంలో ఉండగానే తల్లి లేక తండ్రి అవయవ సమస్యలతో తనువు చాలించినప్పుడు ఆ పిల్లల జీవితం ప్రశ్నార్థకంగా మారిన సందర్భాలూ చూస్తున్నాం. ఇలాంటి హృదయ విదారకరమైన సందర్భాలు, సన్నివేశాలు చూసి పుట్టెడు దుఖ:లో మునిగి తేలేకన్నా మరణించినవారి అవయవాలను దానం చేసేందుకు ముందుకు వస్తే ప్రాణాపాయంలో వున్నవారికి పునర్జన్మ కల్పించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

ఆ ఇద్దరూ మరణించినా జీవిస్తునే ఉన్నారు

ఔను..! ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన ఆ ఇద్దరూ మరణించినప్పటికీ జీవిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం కొత్తవలస గ్రామానికి చెందిన లంకేన సాయి కుమార్ (21) గత ఏడాది నవంబర్ 12న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మరణించిన సంగతి విధితమే. విజయనగరంలోని తిరుమల -మెడికవర్ ఆస్పత్రి వైద్యుల సూచనమేరకు తమ కుమారుడి అవయవాలను దానం చేసేందుకు తల్లిదండ్రులు ముందుకు వచ్చారు. దీంతో, సాయికుమార్ గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులను జీవన్‌దాన్ ట్రస్ట్ సభ్యుల సహకారంతో వైద్యులు సేకరించి, నాలుగు అంబులెన్సులు, ఒక కారు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నడుపుతున్న లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ ద్వారా విశాఖ ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి విమానంలో చెన్నైకు గ్రీన్ ఛానల్ ద్వారా తరలించారు. గంట్యాడ మండలం మురపాక గ్రామానికి చెందిన గండిపల్లి పల్లవి అనే ముక్కుపచ్చలారని బాలిక కూడా 2024 నవంబర్ 23న అరకు ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురై తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. బ్రెయిన్ డెడ్ అయినట్టు గుర్తించిన తిరుమల - మెడికవర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ సమయ స్పూర్తిని ప్రదర్శిస్తూ కుటుంబ సభ్యుల నుంచి అవయవ దానాన్ని కోరారు. అడిగిందే తడువుగా ఆ చిన్నారి తల్లిదండ్రులు తమ కుమార్తె చనిపోయినా మరో వ్యక్తిని బతికించా లన్న పెద్ద మనసుతో వారు కూడా దానం ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఇలా మరణించిన వారి అవయవ దానం ఆపదలోవున్న మరో వ్యక్తికి పునర్జీవం పోస్తుందనడంలో సందేహం లేదు.



అవయవదానం చేసిన పల్లవి (ఫైల్)

చైతన్యంతోనే మరణాల అదుపు

ఒకరు మరణించినా వారి అవయవాలతో మరో 8మందికి పునర్జీవం పోయవచ్చు. ఏ ఒక్క కారణంతో మనిషి మరణించినా ఆ వ్యక్తి శరీరంలోవున్న ఎనిమిది అవయవాల వరకు ఆపదలోవున్నవారికి ఉపయోగ పడతాయని వైద్యులు చెబుతున్నారు. ఈరకంగా దానం చేసేందుకు ముందుకు వస్తే, వాటిని జీవన్‌దాన్ అనే ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ట్రస్ట్ సహకారంతో అవయవాలను తీసి నిర్ధిష్టమైన కాలపరిమితిలో రోగి వేచివున్న ఆసుపత్రికి తరలిస్తారు. ఇందుకోసం జీవన్‌దాన్ ట్రస్ట్ ద్వారా అన్ని ఏర్పాటు చేస్తుందని ఆ ట్రస్ట్ ఛైర్మన్ (విమ్స్ డైరెక్టర్) డాక్టర్ రాంబాబు చెబుతున్నారు. అందుకు తగ్గట్టే గత ఏడాది మన జిల్లాలో అవయవదానం చేసిన సందర్భాల్లో ఆయన సమయ స్పూర్తితో స్పందించారు. ప్రభుత్వం తరపున అనుమతులు ఇవ్వడంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, విశాఖ ఎయిర్‌పోర్టు వరకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎస్‌పి వకుల్ జిందాల్ గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశారు.

అపోహలు వీడితే ఎదుటి మనిషిని బతికించొచ్చు



అవయవదానం పట్ల ప్రజలు అపోహలు, మూఢనమ్మకాలు వీడితే ప్రాణాపాయ స్థితిలోవున్న ఎదుటి వ్యక్తులకు పునర్జీవం పోయవచ్చు. ఈపరిస్థితి నుంచి ఉమ్మడి విజయనగరం జిల్లా ఇప్పుడిప్పుడే బయటపడుతుందని అనిపిస్తోంది. గత ఏడాది బ్రెయిన్‌డెడ్ అయిన ఇద్దరి కుటుంబ సభ్యులు తమ విజ్ఞప్తి మేరకు అవయవదానానికి ముందుకు వచ్చారు. జనంలో ఇంకా చైతన్యం రావాల్సిన అవసరం ఉంది. 2024లో రాష్ట్ర వ్యాప్తంగా 210 మంది నుంచి అవయవ దానం లభించగా 1,148 మంది ప్రాణాలతో బయటపడ్డారు. ఇందులో మన జిల్లాలో ఇద్దరు మాత్రమే ముందుకు వచ్చారు. ఇకపై స్వచ్ఛంద అవయవదానాలకు ముందుకు వస్తారని ఆశిద్దాం.

డాక్టర్ కె.తిరుమల ప్రసాద్
మేనేజింగ్ డైరెక్టర్ తిరుమల -
మెడికవర్ ఆసుపత్రి, విజయనగరం

రైతు సంక్షేమమే ధ్యేయం

రైతు సభలో ఎమ్మెల్యే అదితి • రాకోడు నుంచి ఎఎంసి కార్యాలయం వరకు ట్రాక్టర్లతో ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

రైతుల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిన నేపథ్యంలో విజయనగరం నియోజకవర్గ రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ మంగళవారం రాకోడు గ్రామం నుంచి విజయనగరంలోని ఎఎంసి కార్యాలయం వరకు ట్రాక్టర్లతో కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు. రాకోడులో ఎమ్మెల్యే తొలుత ట్రాక్టర్‌తో దుక్కుదున్ని, భూమి పూజ నిర్వహించి ట్రాక్టర్ నడిపి ర్యాలీ ప్రారంభించారు.

ర్యాలీ జొన్నవలస, దుప్పాడ గ్రామాల మీదుగా వుడాకాలనీ, జిల్లా ఆసుపత్రి రోడ్డు, పోలీస్ బ్యారెక్స్, గూడ్స్‌షెడ్, తహశీల్దార్ కార్యాలయం మీదుగా ఎఎంసి కార్యాలయం వరకు సాగింది. అనంతరం జరిగిన రైతు సంబర సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్న ఎన్‌టిఆర్ పార్టీ ఏర్పాటు చేసినప్పుడే ఆ పార్టీ జెండాలో రైతు, నాగలిని పెట్టి రైతు గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని గుర్తు చేశారు. అదేస్ఫూర్తితో నేడు చంద్రబాబు సైతం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. సూపర్‌సిక్స్ హామీల్లో ఒకటి అయిన అన్నదాత సుఖీభవలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, పిఎం కిసాన్ నుంచి రూ.2వేలు రైతులకు అందించారని తెలిపారు. రైతు పండించిన వరి పంటను కొనుగోలు కేంద్రాల ద్వారా 48 గంటలలోనే కొనిపించి వారి ఖాతాల్లో డబ్బులు పడేవిధంగా చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రైతులను ఆదుకోవడానికి ధాన్యం తడవకుండా టార్పాలిన్లను ఇచ్చామని గుర్తు చేశారు. సకాలంలో విత్తనాలు, ఎరువులు అందిస్తున్నామన్నారు. నదుల అనుసంధానం ద్వారా ప్రతి ఎకరాకూ సాగునీరు అందించేందుకు కృషి జరుగుతోందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తయితే ఉత్తరాంధ్రలో మూడు పంటలకు నీరు అందుతుందని తెలిపారు. రైతాంగం టెక్నాలజీని వినియోగించుకోవాలన్నారు. రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్విని, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ పార్టీ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగ్ రావు, కార్యదర్శి పోలి నాయుడు, రాకోడు, జొన్నవలస ఎంపిటిసిలు రాజేష్ బాబు, వేచలపు శ్రీనివాసరావు, తుమ్మగంటి రామారావు, సుంకరి పైడిరాజు, కనకల రాంబాబు, గంటా రవి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కర్రోతు నర్సింగరావు, వైస్ ఛైర్మన్ చంద్ర నాయుడు, రైతులు పాల్గొన్నారు.



రాకోడు నుంచి ఎఎంసి కార్యాలయానికి ట్రాక్టర్లతో ర్యాలీ చేస్తున్న రైతులు (ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే)

చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం

నాయీ బ్రాహ్మణుల షాపులకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్తు ఇచ్చిన చంద్రబాబు చిత్రపటానికి మంగళవారం నాయీ బ్రాహ్మణులు పాలాభిషేకం చేశారు. రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గంద్రేటి సత్యనారాయణ. జిల్లా ప్రధాన కార్యదర్శి. లక్కవరపుకోట దుర్గారావు. సాధికార కమిటీ సభ్యులు. కొవ్వాడ రామకృష్ణ. జిల్లా మహిళా అధ్యక్షురాలు. అప్పల నరసమ్మ. తాట పల్లి బుజ్జిబాబు. ఆర్ లక్ష్మణరావు. ఆర్ సురేష్. శేఖర మురళి పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ నిర్మూలకు పర్యవేక్షణ అవసరం

ప్రజాశక్తి-విజయనగరంకోట

వెట్టి చాకిరీ నిర్మూలనకు క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ మరింత అవసరమని జిల్లా న్యాయ సేవల అధికార సంస్థ కార్యదర్శి , సీనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణ ప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయ సేవల అధికార సంస్థ, నేచర్ సంస్థల ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి, అభివృద్ధికి నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ గైడ్ లైన్స్‌పై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు సహకరించే చట్టాలపై వారికి అవగాహన కల్పించడంతో పాటు వారి హక్కులు కాపాడుకోవడానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. వెట్టిచాకిరీ నిర్మూలనకు సంబంధిత శాఖ అధికారులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్మిక శాఖ సహాయ కమిషనర్ రమాదేవి మాట్లాడుతూ వెట్టిచాకిరీ విముక్తి కి అనేక చర్యలు తీసుకుంటున్నామని, అటువంటివారికి షెల్టర్ ఏర్పాటు చేయడంతో పాటు ఆర్థికంగా కూడా 35వేల రూపాయల సహాయం అందిస్తున్నామని తెలిపారు. చైల్డ్ రైట్స్ ఫోరం కన్వీనర్ పి.చిట్టిబాబు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు వారు పనిచేసే చోట అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. డెంకాడ, రామభద్రపురం, రంగరాయపురం ప్రాంతాల్లో 32 కేసులు నమోదయ్యాయని తెలిపారు. పని బానిసత్వం లేని జిల్లా గా విజయనగరం జిల్లా రూపొందాలన్నారు. కారక్రమంలో డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, డిఐసి అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

34వ డివిజన్ ఉప ఎన్నికకు సిద్ధం : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఇటీవల మరణించిన 34 వ డివిజన్ కార్పొరేటర్ బాలి పైడిరాజు స్థానంలో ఉప ఎన్నిక నిర్వహించేందుకు సిద్ధంగా సిబ్బంది ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య సూచించారు. మంగళవారం కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ కారణాలతో ఖాళీ అయిన నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో 55 కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవులకు సెప్టెంబర్ 17లోగా ఉప ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు చేపట్టిందన్నారు. ఈ నేపథ్యంలో విజయనగరంలోని 34 వ డివిజన్ కార్పొరేటర్ బాలి పైడిరాజు మరణంతో ఖాళీ అయిన ఆ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి డివిజన్ వ్యాప్తంగా ఉన్న ఓటర్ల ఫోటోలతో కూడిన జాబితాను నిర్ధారించి, ప్రచురించేందుకు నగరపాలక సంస్థ అధికారులు సిద్ధమవుతున్నామన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఓటర్ల జాబితా ప్రక్రియ ఏ విధంగా చేపట్టాలన్న విషయాలపై సోదాహరణగా వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

ఏషియన్ యూత్ వాలీబాల్ జట్టుకు విజయలక్ష్మి ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అక్టోబర్ 19 నుండి 31 వరకు బహ్రెయిన్ లో జరగబోయే ఏషియన్ యూత్ వాలీబాల్ పోటీలలో పాల్గొనబోయే ఇండియా యూత్ ఉమెన్ సెలెక్షన్ జైపూర్‌లో నిర్వహించారు. 500 మంది మహిళలు పాల్గొనగా, విజయనగరం జిల్లా క్రీడాకారిణి ఎం.విజయలక్ష్మి ఆసియా యూత్ గేమ్స్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా విజయలక్ష్మి ఎంపిక పట్ల జిల్లా వాలీబాల్ విజయనగరం జిల్లా అధ్యక్షుడు గవర సూరిబాబు, కార్యదర్శి కెవిఎఎన్ రాజు, (చిన్నారి), జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీ భగవాన్ దాస్ , సన్యాసి నాయుడు, కృష్ణంరాజు అభినందనలు తెలిపారు.

వరల్డ్‌స్కూలు వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు నేడు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వరల్డ్ స్కూల్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ (అండర్-15 బాలురు, బాలికలు) పోటీలు ఈఏడాది డిసెంబర్ 4 నుండి 13 వరకు చైనాలో జరుగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే భారత జట్టులో అవకాశం కల్పించేందుకు జాతీయస్థాయి ఎంపిక పోటీలు బుధవారం నిర్వహించనున్నారు.అందులో భాగంగా ఉమ్మడి జిల్లా, రాష్ట్ర స్థాయిలో వాలీబాల్ ఎంపిక పోటీలు జరుగుతాయని స్కూల్ గేమ్స్ కార్యదర్శి పి.కృష్ణంరాజు తెలిపారు. 8మంది బాలురు, 8మంది బాలికలను ఎంపిక చేస్తామన్నారు. వీరంతా పూణేలో ఈనెల 25నుంచి జరిగే జాతీయ స్థాయి ఎంపికల పోటీలకు హాజరవుతారని తెలిపారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలపై విద్యుత్ భారాలు వేసే స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ ఆధ్వర్యాన మంగళవారం ధర్మపురి గ్రామంలో విస్తత ప్రచారం నిర్వహించారు. అనంతరం ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఆ పార్టీ నాయకులు రెడ్డి నారాయణరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన మంత్రి లోకేశ్ ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఇప్పటికే విద్యుత్ ఛార్జీలు భారాలు మోయలేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మళ్లీ స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలు సొమ్మును అదానీ కంపెనీ కి కట్టబెట్టాలని కూటమి ప్రభుత్వం చూస్తుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ స్మార్ట్ మీటర్లు వేయడానికి వస్తే వాటిని బద్దలు కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు ఈశ్వరరావు, శంకరరావు ప్రజలు పాల్గొన్నారు.

పిఎఫ్,గ్రాట్యుటీ చెల్లించండి : భీశెట్టి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల, ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల తో రోడ్డున పడ్డాయని, కూటమి ప్రభుత్వం వెంటనే కార్మికుల, ఉద్యోగుల పిఎఫ్,గ్రాట్యుటీని ఇప్పించాలని కోరుతూ రాష్ట్ర సూక్ష్మ,మధ్యతరగతి పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ కోరారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి వినతి అందజేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ,కార్మికుల, రైతుల,ఉద్యోగుల సమస్యలు ఇప్పటికీ పెండింగులో ఉన్నాయని, ఉద్యోగులకు పిఎఫ్,గ్రాట్యుటీ వెంటనే చెల్లించాలని కోరామని తెలిపారు.

పిల్లలంతా ఆల్బెండజోల్ మాత్రలు మింగాలి

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-గంట్యాడ

నులి పురుగుల నివారణకు పిల్లలంతా తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సూచించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయన మంగళవారం ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కడుపులోని నులిపురుగులను నివారించేందుకు 19 ఏళ్ల లోపు పిల్లలంతా ఈ మాత్రలను తప్పనిసరిగా వేసుకోవాలని కోరారు. కడుపులో నులిపురుగులు ఉంటే పిల్లల్లో పోషకాహార లోపం ఏర్పడుతుందని, పెరుగుదల మందగించి, బలహీనంగా తయారవుతారని అన్నారు. నులి పురుగులను నిర్మూలించడానికి ఆల్బెండజోల్ మాత్రలను ఒకే డోస్ కింద వాడాలని సూచించారు. దీని కోసమే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో నులిపురుగుల వల్ల కలిగే అనర్థాలు, నిర్మూలనా పద్ధతులపై షార్ట్ ఫిల్మ్ ప్రదర్శించారు. పాఠశాలలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా క్రషర్ డస్ట్ వేయాలని, శిథిలమైన భవనాలను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. డిఇఒ మాణిక్యం నాయుడు, డిఎంఅండ్ హెచ్ఒ డాక్టర్ జీవనరాణి, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుబ్రమణ్యం, ఎగ్జామ్స్ కోఆర్డినేటర్ సన్యాసిరాజు, తాహశీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి, ఎంఇఒ వెంకట్రావు, పాఠశాల హెచ్ఎం ఎ.ఝాన్సీ, ఉపాధ్యాయులు, ఆసుపత్రి వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. నెల్లిమర్ల, డెంకాడ, రేగిడి,వేపాడ, పూసపాటిరేగ, గంట్యాడ, తెర్లాం, లక్కవరపుకోట మండలాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయించారు. పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.



విద్యార్థితో అల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

విజయనగరం టౌన్ : జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం వివిధ పాఠశాలల్లో నిర్వహించిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పాల్గొన్నారు. కంటోన్మెంట్ నగరపాలకోన్నత పాఠశాలలో మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా 1 నుండి 19 ఏళ్లలోపు మధ్య పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


కేసుల దర్యాప్తు వేగవంతం : ఎస్‌పి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీసు అధికారులను ఎస్‌పి వకుల్ జిందల్ ఆదేశించారు. మంగళవారం జిల్లాలోనివివిధ పోలీసు స్టేషన్ల ఎస్ఐలు, సిఐలు, డిఎస్‌పిలతో జూమ్ కాన్ఫరెన్సు నిర్వహించారు. క్రిమినల్ కేసుల్లో దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి, నూతన చట్టాలకు అనుగుణంగా నిర్దిష్ట కాల పరిమితిలో నిందితులపై సంబంధిత న్యాయ స్థానాల్లో అభియోగ పత్రాలు దాఖలు చేయాలని ఆదేశించారు. నూతన క్రిమినల్ చట్టాలకు అనుగుణంగా 10సంవత్సరాల కంటే ఎక్కువగా శిక్షలు విధించే క్రిమినల్ కేసుల్లో 90రోజుల్లోను, అంతకంటే తక్కువ కాలం శిక్షలు విధించే కేసుల్లో 60రోజుల్లోగా నిందితులపై సంబంధిత న్యాయ స్థానాల్లో అభియోగ పత్రాలు దాఖలు చేయాలని ఆదేశించారు. దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఈ సాక్ష్య యాప్ లోను, సిసిటిఎన్ఎస్‌లోను అప్‌లోడ్ చెయ్యాలని ఆదేశించారు. పోక్సో కేసుల్లో బాధితురాలి వయస్సును నిర్ధారించేందుకు ఇకపై పంచాయతీ, మున్సిపల్ ఆఫీసుల నుండి జారీ చేసిన నిర్ధారణ పత్రాలను మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. జూమ్ కాన్ఫరెన్సులో అదనవు ఎస్‌పి పి.సౌమ్యలత, డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, జి.భవ్యరెడ్డి, ఎస్.రాఘవులు, పలువురు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

చెడు వ్యసనాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని మహిళా పిఎస్ డిఎస్‌పి ఆర్.గోవిందరావు సూచించారు. నగరంలోని ఎంఎస్ఎన్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శక్తి యాప్, గంజాయి, మత్తుపదార్థాలు, ఈవిటీజింగ్, పోక్సోచట్టాలు పట్ల మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై డిఎస్‌పి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తమ ఫోన్లో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో చట్టం ప్రకారం శిక్షలు తప్పవని హెచ్చరించారు. యువత గంజాయి, ఇతర మత్తు, మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దని జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. గంజాయి గురించిన సమాచారం ఏదైనా తెలిస్తే డయల్ 100/112 కు లేదా 1972 కు గాని వెంటనే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా పిఎస్ ఎస్ఐ జి .శిరీష, 1వ పట్టణ ఎస్ఐ బి.దేవి, శక్తి టీం సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందల్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

అన్ని విధాలా అభివృద్ధే లక్ష్యం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-గజపతినగరం

నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యమని రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. నియోజకవర్గం సమగ్ర అభివృద్ధిపై అవకాశాలను గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నియోజకవర్గ అధికారులతో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధిపై ప్రణాళికలను రూపొందించి వాటిని విజన్ 2047 డాక్యుమెంట్లో పొందుపరచాలని అన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై స్వల్పకాలిక , దీర్ఘకాలిక ప్రణాళికల రూపకల్పనలో భాగంగా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారించాలని అన్నారు. పాడి రైతుల ఆదాయం పెంచేందుకు సమగ్ర ప్రణాళికను రూపొందించాలన్నారు. రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అందజేసి రెండో పంట సాగును పెంచాలని, తద్వారా వ్యవసాయ రంగంలోను అదికాదాయాన్నిచ్చే పంటలపై దృష్టి సారించాలని కోరారు. ప్రతి మండలంలోను పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి అందుకు అనుగుణంగా అవసరమైన స్థలాలను ఎంపిక చేయాలన్నారు. వివిధ గ్రామాలలో భూసర్వే ద్వారా తలెత్తిన వివాదాలను త్వరిత గతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్ పివి గోపాలరాజు, స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ స్పెషల్ ఆఫీసర్ ప్రమీల గాంధీ, నియోజకవర్గం విజన్ డాక్యుమెంట్ సభ్యులు, పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ లైబ్రేరియన్ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం కోట

గ్రంథాలయ శాస్త్ర పితామహుడైన పద్మశ్రీ డాక్టర్ ఎస్. ఆర్. రంగనాథన్ జయంతి సందర్భంగా జాతీయ లైబ్రేరియన్ దినోత్సవాన్ని మంగళవారం గురజాడ కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, కొత్తలి ఎర్నాయుడు, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, జెవివి జిల్లా అధ్యక్షులు ఎంవి యన్. వెంకటరావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ, గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి రంగనాధన్ చేసిన కృషిని వివరించారు. అనంతరం గ్రంథాలయాధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలు, శాలువాలతో సత్కరించారు.

జెఎన్‌టియులో


విజయనగరం టౌన్ : జెఎన్‌టియు జివి ఇంజినీరింగ్ కళాశాల సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో జాతీయ లైబ్రేరియన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విశ్వవిద్యాలయ తాత్కాలిక ఉపకులపతి ప్రొఫెసర్ డి. రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జె. సుమ, అకడమిక్ ఆడిట్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్. రాజేశ్వరరావు హాజరయ్యారు. సామాజిక కార్యకర్త ఎస్. కె. గౌస్ భాషా, ప్రముఖ కవి పప్పు భోగరావు ప్రధాన అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంలో వారు యువతలో పుస్తక పఠనం, గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు

పంచాయతీలో మస్తర్ల మాయ

◆ పనిచేసేది పదిమంది ◆ మస్తర్లలో 15 మంది ◆ దొంగ మస్తర్లతో దోపిడీ ◆ మేజర్ పంచాయతీలో ఏడేళ్లుగా ఇదే తంతు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

దోపిడీకి కాదేదీ అనర్హం అన్న చందంగా తయారయింది ఎస్‌కోట మేజర్ పంచాయతీ లోని సిబ్బంది తీరు. గ్రీన్ అంబాసిడర్ల మస్తర్లలో మాయాజాలం చేస్తున్నారంటూ కొంతమంది గ్రీన్ అంబాసిడర్లు ఇఒపిఆర్‌డికి ఫిర్యాదు చేశారు. ఈ విషయం ప్రజాశక్తి పరిశీలించగా వాస్తవానికి పది మంది గ్రీన్ అంబాసిడర్లే పనిచేయగా 15 మంది గ్రీన్ అంబాసిడర్లను జులై నెలలో పనిచేసినట్లుగా మస్తర్లు వేసి వారికి పేమెంట్లు చెల్లించాలని ఇఒపిఆర్‌డికి పంపిన మస్తర్ల లిస్టు బయటపడింది. ఈ జాబితాలో 15 మంది పేర్లు వెలుగు చూశాయి. అయితే ఏడేళ్లుగా ఇలా తక్కువ మంది పనిచేస్తే ఎక్కువ మంది పనిచేస్తున్నట్లు మస్తర్లు వేసి నిధులు కాజేస్తున్నట్లు తెలిస్తోంది. అయితే ఈ డబ్బులు ఎవరి ఖాతాల్లోకి వెళుతున్నాయన్న విషయంపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బకాయి ఉన్న వేతనాలు వేయడంతో పాటు అదనపు మస్తర్ల బాగోతాన్ని బయట పెట్టి దోచుకుంటున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



15 మంది పేర్లతో జీతాలకు లిస్టు తయారు చేసిన సిబ్బంది

ఏడేళ్లుగా ఇలానే జరుగుతుంది

2018వ సంవత్సరం నుంచి గ్రీన్ అంబాసిడర్ల మస్తర్లను ఎక్కువ మందిగా చూపి వేస్తున్నారు. 2018 నుంచి 2022 వరకు ఐదుగురు గ్రీన్ అంబాసిడర్లు పనిచేస్తే పదిమంది చేసినట్లుగా మస్తర్లు వేశారు. 2022 నుంచి పదిమంది గ్రీన్ అంబాసిడర్లు పనిచేస్తే 15 మంది చేసినట్లుగా ఈ సంవత్సరం జులై నెల వరకు మస్తర్లు వేస్తున్నారు. మిగతా ఐదుగురు ఎవరు వేస్తున్నారో మాకు తెలియదు. అదేవిధంగా గ్రీన్ అంబాసిడర్లకు 13 నెల జీతాలు బకాయిలు పెట్టారు. వాటి గురించి కలెక్టర్‌కు వెళ్లి విన్నవించుకుంటామని చెప్పగా ఒక నెల డబ్బులు చేతికిచ్చారు. పంచాయతీలో ఏదో మస్తరుల మాయ జరుగుతుందని అనుమానం కలుగుతుంది. ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మునగపాక అప్పారావు గ్రీన్ అంబాసిడర్.

రోజంతా పనిచేయించుకుంటున్నారు..

గ్రీన్ అంబాసిడర్లతో ఉదయం నుండి సాయంత్రం వరకు రోజంతా పనిచేయించుకుంటున్నారు. వీరిలో కొంతమంది పారిశుధ్య కార్మికులు చేసే పనిని కూడా చేయిస్తున్నారు. అయినప్పటికీ వారికి జీతాలు సక్రమంగా చెల్లించడం లేదు. 13 నెలల జీతాలు బకాయిలు పెడితే వారి ఏం తిని బతకాలి. పదిమంది పనిచేస్తే 15 మందికి మస్తర్లు వేస్తున్నారు. ఆ మిగతా ఐదు మస్తర్లు ఎవరికి వేస్తున్నారో తెలపాలి. లేకుంటే సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడతాం.

గాడి అప్పారావు సిఐటియు జిల్లా నాయకులు

విచారణ జరిపి జిల్లా అధికారులకు తెలియజేస్తాం

గ్రీన్ అంబాసిడర్లకు 13 నెలలుగా బకాయిలు ఉన్న విషయం నాకు తెలియదు. మరో ఐదు మందికి అదనంగా మస్తర్లు వేస్తున్నారన్న విషయం పంచాయతీ ఈవోతో మాట్లాడి జిల్లా అధికారులకు తెలియజేసి తదుపరి చర్యలకు పూనుకుంటాం. ప్రస్తుతం పంచాయతీ ఈవో సెలవులో ఉన్నందున 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల అయిన వెంటనే మండలంలో ఉన్న అందరి గ్రీన్ అంబాసిడర్లకు ముందుగా బకాయి ఉన్న జీతాలను చెల్లించమని ఆదేశాలు జారీ చేస్తాను.

లక్ష్మి, ఇఒపిఆర్‌డి, ఎస్‌కోట

మలుపుల వద్ద డొంకలు తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం జంక్షన్ నుండి ఆనందపురం వెళ్లే ప్రధాన రోడ్డు, సింగరాయి గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న మలుపుల వద్ద భయంకరంగా పెరిగిన డొంకలను మంగళవారం తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన డొంకల వల్ల మలుపుల వద్ద పొంచి ఉన్న ప్రమాదం అనే కథనం ఇటీవల ప్రజాశక్తిలో వెలువడింది. దీనికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి సత్యవతి, గ్రామ సర్పంచ్ వెంకటరావు ఆధ్వర్యంలో కూలీలతో డొంకలను తొలగించారు. దీంతో ప్రయాణికులు అభినందనలు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుతున్న 39 మంది విద్యార్థులకు నవోదయ, సైనిక్ స్కూల్లో ప్రవేశానికి అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందించారు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న బొద్దాంకు చెందిన జె.రామకృష్ణ ఈ స్టడీ మెటీరియల్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం పిల్లలందరికీ అవసరమైన రూ.15,990 విలువ గల 39 స్టడీ మెటీరియల్‌లను మంగళవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయునికి అందజేశారు.

రాజధాని నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

రాజధాని నిర్మాణం పూర్తి చేయాలని పిసిసి సభ్యులు ముఖ్యల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లు దాటినా ఇప్పటివరకు రాజధాని రూపుదిద్దుకోలేదని, అసలు రాజధాని ఎప్పటికి పూర్తి చేస్తారని, పూర్తిచేసే ఉద్దేశం ఉందా లేదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల తర్వాత తప్పులు, డొంకలు కొట్టి హడావిడి చేశారని ప్రస్తుత రాజధాని నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదని అన్నారు. ఇప్పుడు రాజధాని నిర్మాణమే ప్రస్తుత అజెండాగా చంద్రబాబు మరల కాలయాపన చేస్తున్నారే తప్ప పనులు ముందుకు సాగటం లేదని, సుదీర్ఘకాలం రాజధాని నిర్మాణం మంచిది కాదని, ఏపీ అవసరాల మేరకు జరుగాల్సిన రాజధాని నిర్మాణం వీలైనంత త్వరగా నిర్మించాలని కోరారు.

విద్యారంగ సమస్యలపై పోరు

ప్రజాశక్తి - బొబ్బిలి

విద్యారంగ సమస్యలు పరిష్కారానికి పోరాటం చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి ఒమ్మి రమణ కోరారు. పట్టణంలోని మంగళవారం ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించి జెండాను ఎగుర వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని విమర్శించారు. విద్యారంగ సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోట అప్పన్న, సుమన్, శ్రావణ్, భరత్, కిరణ్ పాల్గొన్నారు.

హెల్పింగ్ హేండ్స్ ఉదారం

ప్రజాశక్తి - చీపురుపల్లి

మండలంలోని ఇటికర్లపల్లి గ్రామంలో ఉన్న హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ తన ఉదారాన్ని గత కొన్నేళ్లుగా చాటుకుంటుంది. అందులో భాగంగానే అదే గ్రామానికి చెందిన గాడి బోడెమ్మ కుమార్తె భవాని పెళ్లి నిమిత్తం సుమారు 15 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని హెల్పింగ్ హ్యాడ్స్ సంస్థ మంగళవారం అందజేసింది. కాగా గతంలో కూడా ఈ సంస్థ తరఫున అనేక మందికి పలు రకాలుగా సహాయ సహకారాన్ని అందించింది. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు షేక్ పీరు సాహెబ్, కొండాడ రమణయ్య, మీసాల రఘు, లెంక రాము, దన్నాన పైడిరాజు, చింతపల్లి శ్రీను పాల్గొన్నారు.

ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - బాడంగి

దీక్ష మహిళా వెల్ఫేర్ సొసైటీ, మండలి, హెల్పింగ్ సొసైటీ హైదరాబాద్ సంయుక్తంగా మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. దీక్ష మహిళా వెల్ఫేర్ సొసైటీ సిఇఒ ఎల్.శాంతి మాట్లాడుతూ తాము ఇచ్చే పుస్తకాలు పిల్లలకు బాగా ఉపయోగపడతాయన్నారు. ఎంఇఒ లక్ష్మణ్, బాడంగి సర్పంచ్ కె రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి దేవరపల్లి శ్రీను, దీక్షా సిబ్బంది శ్రీరామ్మూర్తి, ఈశ్వరరావు, ఆయా గ్రామాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భరోసాగా ఉంటాను : వలిరెడ్డి

ప్రజాశక్తి - చీపురుపల్లి

అన్ని వేళల మీకు నేను భరోసాగా ఉంటానని వైసిపి ప్రచార విభాగం విజయనగరం జిల్లా అధ్యక్షుడు వల్లిరెడ్డి శ్రీనివాస్ నాయుడు ప్రజలకు భరోసా కల్పించారు. పట్టణంలో సోమవారం ఆయన పలువురు ఇక్కట్లు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎవరికి ఏ ఇబ్బంది వచ్చిన రాత్రి పగలు తేడా లేకుండా ఒక్క ఫోన్ కాల్ చేస్తే క్షణాల్లో మీ ఇంటి దగ్గర ఉండి మీ కష్టాలలో పాలుపంచుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని కొత్త అగ్రహారానికి చెందిన స్టాటిస్టికల్ అధికారైన సత్యనారాయణను ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఏమి అవసరం వచ్చినా తనని సంప్రదించాలని సత్యనారాయణ కుటుంబానికి భరోసా ఇచ్చారు. శ్రీనివాసనాయుడుతో పాటు చీపురుపల్లి వైసిపి పట్టణ అధ్యక్షుడు పతివాడ రాజారావు, కల్లోజు ప్రసాద్, కో-ఆప్షన్ మెంబర్ మహమ్మద్ ముజకిర్, జలగ రమేష్, మహంతి లక్ష్మణ, మొండేటి శ్రీనివాసరావు, ప్రభాత్ కుమార్, పతివాడ అఖిల్, పెనుమజ్జి రామకృష్ణ, వెంకటేష్, చక్రి, అప్పలరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయంగా పనిచేయాలి

చీపురుపల్లి : అంగన్వాడి కేంద్రాల్లో గల ప్రతి కార్యకర్త ఆదర్శనీయంగా పనిచేస్తూ పిల్లలకు సకాలంలో పౌష్టికాహారం అందజేయాలని చీపురుపల్లి సెక్టార్ సూపర్వైజర్ పి.శశికళ సూచించారు. పట్టణంలోని విజయకాలనీ, లావేరు రోడ్డు, రామాంజనేయ కాలనీ, కేంద్రాలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తలు రికార్డుల నిర్వహణతో పాటు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అవసరమైన పౌష్టికాహారాన్ని సకాలంలో అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ట్రాక్టర్ ర్యాలీ

వేపాడ: ఎల్‌కోట మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్ నుంచి ఎస్‌కోట మండల కేంద్రంలోని దేవి కూడలి వరకూ సుమారు 15 కిలోమీటర్లు వరకూ బుధవారం చేపట్టనున్న ట్రాక్టర్ ర్యాలీలు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఒక ప్రకటనలో కోరారు. 'అన్నదాత సుఖీభవ' రైతులందరికీ అందినందుకు ఈ ర్యాలీ చేపడుతున్నామని ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇళ్లల్లో డ్రగ్స్ తనిఖీలు

రేగిడి: మండలంలోని చెలికానివలసలో మంగళవారం రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర రావు ఇళ్లల్లో డ్రగ్స్ తనిఖీలు నిర్వహించారు. అనుమానిత ఇళ్లల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి, నాటుసారా వంటివి అమ్మకాలు జరుగుతున్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. మత్తు పదార్థాలు గ్రామాల్లో ఉన్నట్లు సమాచారం వస్తే అనుమానతులపై కేసులు తప్పవని హెచ్చరించారు. సిఐతో పాటు ఎస్ఐ నీలావతి, పాల్గొన్నారు.

రాష్ట్ర దాసరి సంక్షేమ సంఘం బోర్డు చైర్మన్‌గా పొట్నూరు

శృంగవరపుకోట: నిశ్వార్థ సేవకుడు టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ, పార్టీ ఆదేశాల మేరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తూ, కోళ్ల కుటుంబానికి అండగా ఉంటున్న సీనియర్ నాయకులు పొట్నూరు వెంకటరత్నాజీ సేవలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి గుర్తించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దాసరి సంక్షేమ, అభివృద్ధి సంఘం బోర్డు చైర్మన్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన నియామకం పట్ల నియోజకవర్గ టిడిపి నాయకులు, దాసరి కమ్యూనిటీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

బాధ్యత కలిగిన ప్రభుత్వమిది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం బాధ్యతగల ప్రభుత్వమని, అందుకే ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తోందని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మిగజపతిరాజు అన్నారు. సోమవారం రాత్రి బడుకొండపేట, నగరంలోని 35,36 డివిజన్లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం బడుకొండపేటలో ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యతోపాటు వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా ప్రతి రైతు ఖాతాలలో రూ.7వేలు వేసిన ఘనత తమదేనన్నారు. ఈనెల 15న స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీలలో 4 హామీలను అమలు చేసినట్లు తెలిపారు. బడుకొండపేట టిడిపి నాయకులు పాశి అప్పలనాయుడు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 6నెలల్లోనే బడుకొండపేట పంచాయతీలో 40శాతం అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నామన్నారు. కొత్త పంచాయతీలకు నిధులు, శ్మశానవాటిక ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. గ్రామంలో 232మంది రైతులకు అన్నదాత సుఖీభవ, 432 మంది తల్లులకు తల్లి వందనం పథకాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, రాకోడు ఎంపిటిసి వేచలపు శ్రీనివాసరావు, బడుకొండ పేట పార్టీ అధ్యక్షులు బడుకొండ శ్రీనివాసరావు, ముళ్ల నారాయణప్పడు , మండల, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



బడుకొండపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అదితి, పి.అప్పలనాయుడు

భోజనంలో నాణ్యత లేదని నిరసన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని ఎస్‌సి బాలుర వసతి గృహంలో విద్యార్థులకు పెట్టే భజనం నాణ్యత లేదని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు హాస్టల్లో భోజనం చేయకుండా ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ గత కొంతకాలం నుంచి హాస్టల్లో భోజనం బాగోలేదని విద్యార్థులు సంఖ్యకు తగ్గట్టు భోజనంలో నాణ్యత లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. భోజనం నాణ్యత పెంచాలని కోరుతూ ఉదయం టిఫిన్ మధ్యాహ్నం భోజనం తినకుండా నిరసన వ్యక్తం చేశారు. ఇకనైనా హాస్టల్ వార్డెన్ తీరు మార్చుకొని భోజనం నాణ్యత ఉండే విధంగా తయారు చేయించాలని లేనియెడల జిల్లా స్థాయిలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మహేష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

భూ రికార్డుల్లో తప్పులను సరి చేసుకోండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

భూ రికార్డులలో తప్పులను సరి చేసుకోవాలని మండల రీ సర్వే ఉపతాహశీల్దార్ కీర్తి అన్నారు. మండలంలోని తిమిడిలో మంగళవారం ఆమె రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫీల్డ్ ప్యూరిఫికేషన్ ఆఫ్ లాండ్ రికార్డ్స్ చేయించుకోవాలన్నారు. తిమిడి రీ సర్వే ల్యాండ్‌కి 13 నోటిఫికేషన్ ఇవ్వనందున మ్యుటేషన్ పెట్టుకొని మీ భూమి ఆన్ లైన్ చేసుకోవాలని రైతులకు అవగాహన కలిగించేందుకు గ్రామసభ నిర్వహించామని తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన జనసేన నాయకులు వబ్బిన సన్యాసినాయుడు మాట్లాడుతూ సాదా బైనామాలు ఆన్ లైన్ చేయడానికి ప్రభుత్వం అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. గత వైసిపి ప్రభుత్వం చేయించిన రిసర్వే లోపాలను సవరించేందుకు మరలా రీ సర్వే చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వబ్బిన త్రినాధమ్మ, వైస్ సర్పంచ్ బర్ల అమ్మి నాయుడు, ఎంపిటిసి పదాల ధర్మారావు, వి రాంబాబు సచివాలయం సర్వేయర్ సాయి, విఆర్ఎ జ్యోతి రైతులు పాల్గొన్నారు

మొరాయించిన బడి బస్సు

ప్రజాశక్తి - వేపాడ

మండల ంలోని బక్కునాయుడుపేట వద్ద ఉన్న ఎపి ఆదర్శ పాఠశాలకు ఎస్‌కోట ఆర్‌టిసి డిపో నుండి వేసిన బడి బస్సు ఎప్పటికప్పుడు మొరాయిస్తుంది. ఈ బస్సులో బొద్దాం, పాటూరు, సోంపురం, అరిగిపాలెం, జగ్గయ్యపేట, సింగరాయి, ఆకుల సీతంపేట, ఆతవ గ్రామాల నుండి విద్యార్థులు ఆదర్శ పాఠశాలకు ఈ బస్సు గుండానే ప్రయాణించాల్సి ఉంది. మంగళవారం ఉదయం ఈ బడి బస్సు సీతంపేట, ఆతవ జంక్షన్ మధ్య మొరాయించింది. దీంతో బస్సులో ప్రయాణించే పిల్లలు సమయానికి స్కూల్‌కు వెళ్లలేమేమోనని ఆందోళనకు గురయ్యారు. పిల్లలకని నిర్లక్ష్యంతో కాలం చెల్లిన, పాత బస్సును కేటాయించడంతో ఎప్పటికప్పుడు బస్సు మొరాయిస్తుందని పిల్లలు చెబుతున్నారు. పైగా పిల్లలు కూడా కెపాసిటీకి మించి ఎక్కుతుండడం వల్ల పాత బస్సు ఎప్పుడు ఎక్కడ ఆగిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. యాజమాన్యం ప్రభుత్వానికి నివేదించి పాఠశాలకు సకాలంలో పిల్లలు చేరుకునే విధంగా కండిషన్‌లో ఉన్న బస్సులను ఏర్పాటు చేస్తే బాగుంటుందని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో నిలిచిపోయిన బడి బస్సు

జిందాల్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

గిరిజనలను మోసం చేసి గ్రామాలకు గ్రామాలే వారికి తెలియకుండా రిజిస్ట్రేషన్ చేసుకుని రికార్డులు మార్చేసిన జిందాల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జిందాల్ నిర్వాసితులతో కలిసి ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని బొడ్డవరలో జిందాల్ బాధిత గిరిజనుల ఆందోళనను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దెప్పూరు, బందవలస గ్రామాలకు చెందిన గ్రామ పంచాయతీలో ఎటువంటి ఆమోదం గాని, గ్రామ సభలు కానీ పెట్టకుండా ఆ గ్రామాల భూములను జిందాల్ పేరున రిజిస్టర్ అయిపోయాయన్నారు. 18 ఏళ్ల తర్వాత జిందాల్ యాజమాన్యం గ్రామాలు ఖాళీ చేయాల్సిందేనని చెబుతూ జెసిబిలతో బంధవలస గ్రామాన్ని ఇప్పుడు దెప్పూరు పై పడ్డారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జిందాల్ చేస్తున్న అన్యాయాలు అక్రమాలు, మోసాలపై సమగ్ర దర్యాప్తు జరిపి గిరిజన దళిత రైతులకు న్యాయం చేయాలని జగన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిందాల్ బాధితులు పాల్గొన్నారు.

మోసగించడంలో చంద్రబాబు సిద్ధహస్తుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నమ్మించి మోసం చేయడంలో కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిద్ధస్తుడని వైసిపి విజయనగరం సమన్వయకర్త, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 41వ డివిజన్ కార్పొరేటర్ సుంకర నారాయణస్వామి అధ్యక్షతన మంగళవారం జరిగిన బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వ పనితీరును, అమలు చెయ్యని పథకాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ప్రజలను మోసగించడంలో చంద్రబాబు దిట్ట అని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, మాజీ మున్సిపల్ కార్పొరేటర్ ఆవనాపు లక్ష్మణరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘం రెడ్డి బంగారు నాయుడు, వైసిపి నగర ఉపాధ్యక్షులు రెడ్డి గురుమూర్తి, మైనారిటీ సభ్యులు ఎం.డి మున్వర్, రహీమ్, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మోసాలను మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ప్రచారం చేశారు. పట్టణంలోని 27వ వార్డులో మంగళవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల హామీలు అమలు చేయకుండా చంద్రబాబు చేస్తున్న మోసాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ పిల్లలకు తప్పిన ప్రాణాపాయం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని కౌముది స్కూల్ చిన్నారులకు పెను ప్రమాదం తప్పింది. సిఐ నారాయణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం స్కూల్ విడిచిపెట్టిన వెంటనే స్కూల్ బస్సు 35 మంది విద్యార్థులను ఎక్కించుకొని విద్యార్థులను వారి గ్రామాలలో దించేందుకు బయలుదేరింది. మండలంలోని కొత్తూరు గ్రామం వద్దకు రాగానే కొత్తవలస నుంచి ఎస్.కోట వస్తున్న కారు రాంగ్ రూట్లో వచ్చి స్కూల్ బస్సును బలంగా ఢీకొంది. రెండు వాహనాలకు ముందు భాగాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రమాదం జరిగిందని తెలియడంతో చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళన చెందారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యం స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నమ్మించి మోసగించిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - తెర్లాం

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాగర్ బాబు చెప్పారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలోని గొలుగువలస గ్రామానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన ఓ అవివాహితను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. తరువాత నిరాకరించడంతో మోసగించినట్లు తెర్లాం పోలీసులకు బాధితు మహిళ ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

విద్యార్థులు స్నేహ భావంతో మెలగాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వైద్య విద్యార్థులు స్నేహ భావంతో మెలగాలని భోగాపురం రూరల్ సిఐ రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక మిమ్స్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్నేహ భావంతో మెలగాలని కొత్తగా వచ్చిన వారిని ర్యాంగింగ్ పేరిట ఇబ్బందులు పెట్టవద్దని కోరారు. ర్యాగింగుకి పాల్పడ్డవారికి కఠిన శిక్షలు వేస్తామని చెప్పారు. విద్యార్థులు బంగారు భవిష్యత్తు కోసం తమ లక్ష్యాలు సాదించుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మిమ్స్ డీన్ సిహెచ్ లక్ష్మీకుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ సి.రఘురాం, ఎస్ఐ బి.గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి- డెంకాడ(భోగాపురం)

భోగాపురం మండలంలోని గాబువానిపేట, మంజేరు గ్రామాల్లో బాధితులకు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మంగళవారం సిఎం సహాయ నిధి చెక్‌లను అందించారు. ఈ సందర్భంగా నల్ల తాతయ్యలకు రూ. రూ.45,700 చెక్కును అందించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలపై భారం తగ్గించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు.

సబ్ జైల్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ విజయనగరం సబ్ జైలును మంగళవారం తనిఖీ చేశారు. ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వీరికి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీల పట్ల సిబ్బందిగాని తోటి ఖైదీలు గాని ఎటువంటి వివక్షత చూపించరాదని తెలిపారు. సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ లను తనిఖీ చేశారు. ఖైదీలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేర ప్రవృత్తిని విడనాడాలని హితవు పలికారు

ఆటల పోటీలతో సృజనాత్మకత

ప్రజాశక్తి- గంట్యాడ

విద్యార్థులలో సృజనాత్మకతను వెలుగు తీయడానికి, చైతన్య పరచడానికి ఆటల పోటీలు దోహదపడతాయని అంగన్వాడి సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం నరవ మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో వ్యాచరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి పోటీలు వల్ల విద్యార్థులలో అపారమైన మేధాశక్తి బయటపడుతుందన్నారు. జీవన నైపుణ్యాలు మెరుగుపరుచుకునేందుకు దోహదపడతాయని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రమణమ్మ మాట్లాడుతూ విద్యార్థులు సరికొత్త అంశాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తమలో ఉన్న ప్రతిభను వెలుగు తీసి సమాజంలో ఉన్నత స్థాయిలో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.మధురలక్ష్మి, బి.శాంతి, అంగన్వాడి వర్కర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.